మరణాంతాని వైరాణి

శ్రీ పి. వి. భట్టుశర్మ

వెంకటరామయ్య పోగానే బంధువులంతా చేరి ముందుపని చూడండని తమ్ములను హెచ్చరించారు. సీతారామయ్య, తమ్ముడు సుబ్బారావుని రూపాయిలు పట్టుకురమ్మన్నాడు. తమ్ముడు కొంచెం గడసరి. ఆపైన అన్న పరిస్థితి తెలిసినవాడాయె. ధీమాగా 'నాదగ్గరేమీలే'దన్నాడు. మరైతే ఏం చెయ్యాలి అనే సమస్య వేధించింది సీతారామయ్యను. చివరకు చనిపోయిన అన్నగారి స్వార్జితం ఎలాగూ 5 ఎకరాల కొండ్ర ఉండనే ఉన్నదిగదా, ఎక్కడైనా తాకట్టు పెట్టి పట్టుకురమ్మన్నాడు. వెంటనే సుబ్బారావు లోలోపలే సంతోషిస్తూ, షాహుకారు తిమ్మయ్యసెట్టిదగ్గిఱ 300 రూపాయలు తెచ్చాడు. మొత్తంమీద ఎలా అయితేనేం కర్మకాండ నలుగురూ బాగా జరిగిందనేటట్లు పూర్తిచేశారు. చివరిరోజున సుబ్బారావు అన్నగారికి 301 రూపాయలు కర్చు చూపించేశాడు, ఉన్నవి కొన్నీ లేనివి కొన్నీని. నిజానికి రెండు వందలే అయినా అంకెల్లో చాలా మహత్యం కనపడ్డది సీతారామయ్యకు. అయితే నేమి-లెక్క కట్టింది పైవాడుకనుకనా! ఏమనగలడు? సుబ్బారావు కొంచెం చదువుకొన్నవాడు "నీవాటా 150 రూపాయలూ ఇస్తే నావంతు పూర్తిచేసి తాకట్టు విడిపించి చనిపోయిన అన్నగారి భూమి పంచుకుందా" మన్నాడు. అన్నదమ్ములు విడిపోయిన లగాయతు సీతారామయ్య ఏరోజు కారోజు గడుపుకొని పోతున్నాడేకాని వెనకకువేసే స్థితిలో ఉన్నవాడు కాడు. సుబ్బారావు అన్న లోకువ కనిపెట్టే ఉన్నాడు కాబట్టి "నీవంతు రూపాయలు ఎప్పుడిస్తే అప్పుడే నీవంతు భూమి యిస్తా"నన్నాడు. సరే అలాగే కానియ్యి" అన్నాడు చేసేదిలేక సీతారామయ్య.

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. ముప్పైసంవత్సరాలు గడిచిపోయినా సీతారామయ్య చేతికి నూటయాభైరూపాయలు సమకూడనేలేదు. ఆ తరవాత సీతారామయ్య కొడుకు, జగపతిచేతికి అందివచ్చాడు. జగపతి సంపాదించినంతలోనే కూడబెట్టి, కష్టాతికష్టంమీద నూటయాభై చేసి, రెండెకరాలన్నర నిలబెట్టుకున్నామనుకొన్నాడు. పినతండ్రి దగ్గరకు చేరి "మా నాన్న ఇవ్వవలసిన సొమ్ము తీసుకొని భూమి నా పేర వ్రాయ"మన్నాడు.

ముప్పైయేళ్లనుండి భూమి మన భుక్తంలోనే ఉన్నదిగదా, ఇంక అన్నగారేమి చేస్తాడనే దిలాసాతో బంగారంపండిస్తున్నాడు సుబ్బారావు. తిండికి లోపం లేకపోతే మన దేశంలో మోతుబరికింద జమే. ఆ పైన ఊళ్లో నలుగురనూ మంచి చేసుకొన్నాడు. "నీచిత్తం వచ్చినట్లు చేసుకో, ఇన్నేళ్లయింది ఇంకెక్కడి భూమి అన్నాడు జగపతితో. ఇన్నాళ్లూ పడిన శ్రమ వృథా అయినందుకు జగపతికి మంటెత్తింది. ఎందుకురాదో చూస్తానన్నాడు జగపతి - మాటా మాటా పెరిగింది సుబ్బారావు నాస్తి శబ్దం చెప్పడంతోటే "నాకు లేకపోతే నీకంతకంటే లేకుండా చేస్తా"నని జగపతి శపథం పట్టాడు.

జగపతిది యువకరక్తం. తనకు రాకపోతే పినతండ్రి ఎందుకు అనుభవించాలి అనే ఆలోచన వేధించసాగింది. ఎక్కడో దూరాన ఉన్న సుబ్బప్ప ఇంటికి ప్రయాణం కట్టాడు. ఈవిడ అసలు వెంకటరాయ్యకూతురే. ఎప్పుడో చిన్నతనంలోనే తండ్రి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపించాడు. అప్పటినుండీ తండ్రి పోయినప్పుడొకసారి వచ్చి నలుగురితోబాటు కన్నీరుకార్చి పినతండ్రులు కర్మ ముగించాక అత్తవారింటికే వెళ్లిపోయింది. ఈలోగా భర్తపోయినాడు. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఏదో ఇంత వేళకు తింటూ కృష్ణా రామా అనుకుంటూ రోజులు వెళ్లబుచ్చుతూ ఉండేది. ఈ విడను వెతికి వెతికి వచ్చి జగపతి పినతండ్రిపై దావా చెయ్యమన్నాడు. "నాకెందుకురా, ఏదో కలోగంజో కాలక్షేపం చేసేస్తున్నాను. దావాకు బోలెడు ఖర్చు పోవడం, తీరా చేస్తే ఫలితం ఏమవుతుందో చెప్పలేము. సొమ్ముపోయి దిమ్మగొట్టినట్లు ఎందుకు వచ్చిన క్షోభ" అన్నదామె.

"అలా కాదు, తప్పకుండా మన దావా గెల్చి తీరుతుంది. పెట్టుబడినే పెడతాగా, ఎలాగైనా చేసితీరాల్సిందే" అంటూ తన పట్టుదల చెప్పాడు.

"సరేఅయితే, కాని నాదగ్గిర చిల్లుగవ్వ లేదన్నదామె. ఎట్లా అయితేనేం, పెట్టుబడి ఖర్చంతా తాను పెట్టుకోడానికి ఒప్పన్నమైె ఆమె పేరుతో మునసబుకోర్టులో సుబ్బారావుపై దావా దాఖలుచేశాడు. దావా అంటే వేశాడు కాని, జగపతికి అనుభవం శూన్యం. సాక్ష్యాలు సంపన్నాల కోసం అయిదువందలారిపోయాయి. అవతల సుబ్బారావు ఊళ్ళో నలుగురనూ ఆకట్టుకొని పైసా కర్చుకాకుండా చనిపోయిన తన అన్న వెంకటరామయ్యకు సుబ్బప్ప అనే కూతురే లేదని పెద్దమనుష్యులచేత సాక్ష్యం ఇప్పించేసరికి కొట్టివేస్తూ ఫిర్యాదీలను కర్చులు ఇచ్చుకోమన్నాడు మునసబు.

ద్వేషం రాకూడదేగాని వస్తే అంతతో ఆగుతుందా? జగపతి అసలే పట్టుదల మనిషి. ఉన్నదాంట్లో ఒక ఎకరం అమ్మేసి జిల్లాకోర్టుకు కాళ్లరిగేటట్లు తిరిగి ప్లీడర్లనూ గుమాస్తాలనూ ఆశ్రయించి, సంతోషపెట్టి తన పక్షం అయిందనిపించుకొనేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. సుబ్బారావువంటి పరువు ప్రతిష్ఠలుగల వ్యక్తి అంతటితో ఆగిపోతాడా? నలుగురి మాటలకు తలయొగ్గి తన పరువుకు భంగం కలిగిందనుకుని హైకోర్టుకు పరుగెత్తాడు. జగపతి యింకో ఎకరం అమ్మి, యింట్లో ఆడవాళ్ల వస్తువుల నమ్మించి హైకోర్టులో తన పార్టీకే విజయం అనిపించుకొన్నాడు కాని కాళ్లు చల్లబడ్డాయి.

చివరకు భూమి స్వాధీనం చేసుకోడానికివచ్చిన సుబ్బప్ప నాలుగురోజులు సీతారామయ్య ఇంట్లో మకాము వేసి నలుగురు రైతులనూ కలుసుకొని ఎవళ్లు ఎక్కువ శిస్తు ఇస్తామంటే వాళ్లకే భూమి అమరకం చేసివేసింది. "ఇంత కష్టపడినదీ ఇందుకేనా? నాలుగేళ్లపాటేనా భూమి నాకివ్వవా" అన్నాడు జగపతి. ఊళ్ళోవాళ్లిస్తామన్నదానికి పది పదిహేనురూపాయిలు తగ్గించి పుచ్చుకుంటే అభ్యంతరం లేదన్నది సుబ్బప్ప. పోయిన ఆస్తి ఎట్లాగూ పోయినది. ఇది మనల నుద్ధరిస్తుందా అని జార్చేశారు జగపతీ సీతారామయ్యాను. కాని రోజులు వెళ్ళేదెలాగ? ఇంట్లో గిన్నెలకు, చెంబులకు కాళ్లు వచ్చాయి. తండ్రి కొడుకులు రెక్కాడితేనే డొక్కాడుతుం

వనే స్థితికి వచ్చారు. వృద్ధాప్యంలో సీతారామయ్య తన పరిస్థితికి కొడుకును చీదరించుకోవడం ప్రారంభించాడు. "మొదట్లో నేనువ్వు వద్దన్నట్లైతే నే నింతవఱకు వెడుదునా" అని యెదురు తిరిగేవాడు జగపతి. రోజులు దొర్లిపోతున్నాయి.

హైకోర్టులో అపజయం పొందడంతో సుబ్బారావు వ్యవహారం చితికింది. బంగారంపండే భూమి వదలవలసిరావడం, చేతిలో పైసా ఆరిపోవడంతో మనోవ్యథ ఎక్కువై మంచం పట్టాడు. సుబ్బారావుకు ముగ్గురు కూతుళ్లూ ముగ్గురు కొడుకులూ. ఆడపిల్లల పెళ్ళిళ్ళకు కొంత హరించిపోయింది. మోతుబరితనం నిలబెట్టుకోవాలాయె. కుఱ్ఱాళ్ళు చేతికి అందివచ్చినవాళ్ళు కాదు. ఒక్క రెక్కతో సంసారం ఈదడం కష్టమైపోయింది. క్రమంగా ఈ విచారంతో జీవయాత్ర చాలించాడు. సంసార భారమంతా సుబ్బారావుభార్య నెత్తిపై పడ్డది. ఆవిడ కొన్నాళ్ళు చూచింది. ఇంట్లో తిండివచ్చే యెత్తు కనపడక ముగ్గురు కూతుళ్లదగ్గరకూ ముగ్గురు కొడుకులనూ పంపి తాను ఎలాగో కాలక్షేపం చేద్దామని అభిప్రాయపడ్డది. అప్పగార్లు తమ్ముళ్ళను ఎంతకాలం భరించగలరు? అత్తింటి కోడళ్ళాయె. మూడు నెలలు వాళ్ళను బాగా చూచినా తర్వాత చీదరించుకోడం ప్రారంభించారు చివరకు కుఱ్ఱాళ్లు తల్లిదగ్గరకు చేరక తప్పిందికాదు. ఆమె జీవితం నానాటికి దుర్భరమౌతున్నది.

కుఱ్ఱాళ్లు ఊరివాళ్ల పొలాల్లో చెరుకుగడలు ఎత్తుకువచ్చి, మొక్కజొన్న పొత్తులు దొంగిలించి ప్రాణం కాపాడుకో సాగార్చు ఆ వృత్తి ఎన్నాళ్లు దాగుతుంది? రైతులు కుఱ్ఱాళ్ళను పట్టుకువచ్చి తల్లియెదుట పెట్టి చివాట్లు పెట్టేవారు. ఎదుటి గుమ్మంలో ఈ అవస్థ అంతా చూస్తున్న జగపతికి జాలి కలిగింది. ఎంత చెడ్డా పినతండ్రికొడుకులు. విరోధాలు వచ్చాయి కాని రక్తసంబంధం ఎక్కడికి పోతుంది? ఎదురుగా సాయం చేస్తే పినతల్లి సమ్మతించదేమో! చాటు చాటున కుఱ్ఱాళ్లకు ఏమన్నా పెడుతుండేవాడు. అప్పటప్పట డబ్బులిస్తూండేవాడు. కుఱ్ఱవాళ్ళకు నోరుతియ్యబరిచేవాళ్ళే బంధువులుగదా మరి! అన్నయ్యా - అన్నయ్యా అంటూ దరిచేరేవాళ్లు. పినతల్లి కీ సంగతి తెలిసింది. మొదట్లో జగపతిహృదయం తెలియక సందేహించింది. క్రమంగా జగపతి ప్రవర్తనలో మార్పుకు సంతోషించింది. సీతారామయ్యకు కూడా కొడుకు చేస్తున్న సహాయం తెలియవచ్చింది. జగపతిని పిల్చిగద్దించాడు. "మనవైరంచిన్నాన్నతోటే సరి. కుఱ్ఱవాళ్లమీదనా మన ప్రతాపం?" అన్నాడు జగపతి. 'మరణాంతాని వైరాణి' అని సమాధానపడ్డాడు సీతారామయ్య— ★

ఆరోగ్యమునకై సరియైన ఆహారమును తినండి

ప్రతివిధ ఆహారపదార్థములో వేరేవేరే విధములైన ఆహారవస్తువులున్నవి. అందువలన ఆరోగ్యమునకు మరియు బలమునకు కావలసిన ఆహారవస్తువులు ఐదింటిని పొందుటకు వివిధ ఆహారములను మనము తినవలెను. దీనికే సరియైన ఆహారమని పేరు. కాబట్టి (1) విటమినులు, (2) ప్రోటీన్లు, (3) లోహాదులు, (4) కార్బోహైడ్రేట్లు మరియు (5) క్రొవ్వుపదార్థములు యున్న ఆహారమే సరియైన ఆహారము. ఈ ఐదును ఆవశ్యకము. నిలబడు శక్తినిచ్చు క్రొవ్వు పదార్థములగురించి చెప్పవలెనంటే ఉపయోగించుటకు చాల అనుకూలమైనటువంటియు, ఆరోగ్యకరమైనటువంటియునైన వాటిలో డాల్డా ఒకటి. ఏ విధ వంటకైనను డాల్డా అనుగుణముగా నుండును మరియు ఇది ఎల్లప్పుడు క్రొత్తగాను, శుభ్రముగాను, సీలుచేయబడిన డబ్బాలలో మిమ్ములను చేరును. సరియైన ఆహారముగురించి పూర్తియైనటువంటియు, ఉపయోగకరమైనటువంటియునైన విషయములను ఉచితముగా ఈ వేళో లేక ఏ దినమైనను క్రిందజెప్పబడిన అడ్రసుకు వ్రాయండి

దీ డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్ట్ బాక్స్ నంబరు 353, బొంబాయి 1

శక్తికై డాల్డాతో వండండి



సరియైన ఆహారములో మీకు కావలసిన క్రొవ్వుపదార్థమును ఇచ్చును

HVM. 175-50 TL

చక్కనివ్రాతకు, మన్నికకు
అశోకా
కలములనే వాడండి

అశోకా పెన్ వర్క్సు
తెనాలి